క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెనగలూరు : మండలంలోని చక్రంపేట పరిధిలోని చుట్టు పక్కల గ్రామాలకు బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ షఫీ తెలిపారు. చక్రంపేట, పొందలూరు, గుడ్లవారిపల్లి, కాకర్లవారిపల్లి పరిధిలో ఉన్న పరిసర గ్రామాలకు కూడా విద్యుత్ నిలిపివేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. విద్యుత్ లైన్ సమీపంలో ఉన్నటువంటి చెట్లను తొలగించే కార్యక్రమం, మరమ్మతులు చేయుటకు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు, రైతులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం



ర్యాలీ నిర్వహిస్తున్న ఏబీవీపీ నాయకులు

సుండుపల్లె : ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండలంలోని ఎంకేఆర్ జూనియర్ కళాశాల నుంచి బస్టాండ్ వరకు ఏబీవీపీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ అన్నమయ్య జిల్లా కన్వీనర్ నాగిరెడ్డి మాట్లాడుతూ ఏబీవీపీని 1949 జూలై 9న స్థాపించారని, ఢిల్లీ యూనివర్సిటీలో నలుగురితో ప్రారంభించిన ఏబీవీపీ ఈరోజు దేశంలో అతిపెద్ద స్టూడెంట్స్ ఆర్గనైజేషన్‌గా మారిందన్నారు. కేజీ నుంచి పీజీ వరకు ఎటువంటి విద్యారంగ సమస్యలున్నా పోరాడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు నందకిషోర్, హరి, సిద్ధేశ్వర తదితరులు పాల్గొన్నారు.


సచివాలయ సెక్రటరీకి సన్మానం



అనంతంపల్లి సెక్రటరీ సునీతను సన్మానిస్తున్న దృశ్యం

పెనగలూరు : మండలంలోని అనంతంపల్లి సచివాలయ సెక్రటరీ సునీతను మంగళవారం ఘనంగా సన్మానించారు. ఆమె గత నాలుగేళ్లుగా పంచాయతీ సెక్రటరీగా ప్రజలకు సేవలు అందించారు. ప్రస్తుతం ఎంపీడీఓ కార్యాలయానికి సరెండర్ చేయడంతో ఆమెకు వైఎస్సార్‌సీపీ నాయకులు సన్మానం చేశారు. రెడ్డయ్య నాయుడు, హరీష్ నాయుడు మాట్లాడుతూ సెక్రటరీ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటూ సేవలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో అనంతంపల్లి ఉప సర్పంచ్ ఆరె మహాలక్ష్మమ్మ, పేరం రెడ్డయ్య నాయుడు, ఆరె రెడ్డయ్య నాయుడు, జె.హరీష్ నాయుడు, పి.హరినాయుడు, ఉమా మహేష్ తదితరులు పాల్గొన్నారు.

దూమ్రరూపంలో అమ్మవారు



దూమ్ర రూపంలో లలితత్రిపుర సుందరిదేవి

మదనపల్లె సిటీ : వారాహీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక దేవళంవీధిలోని శ్రీ సోమేశ్వరస్వామి ఆలయంలో లలిత త్రిపురసుందరిదేవి అమ్మవారు దూమ్ర రూపంలో అలంకరించారు. ఐదు ప్రమిదలతో ఎర్రవొత్తిదీపాలు వెలిగించి పూజలు చేశారు. భక్తులకు అర్చకులు ఆలూరి ఫణికుమార్‌శర్మ తీర్థప్రసాదాలు అందజేశారు.స్థానిక అయ్యప్పనగర్‌లో వెలసిన బాల అయ్యప్పస్వామి ఆలయంలో గాయిత్రిదేవి అమ్మవారిని గంధం అలంకారంతో అలకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకం

బి.కొత్తకోట : మండలంలోని గోళ్లపల్లె జెడ్పీ హైస్కూల్‌లో 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మానవత సంస్థ ప్రతినిధులు ప్రోత్సాహక నగదును అందించారు. 567 మార్కులు పొందిన నరేంద్రకు రూ.3 వేలు, 540 మార్కులు పొందిన రాజేష్‌కు రూ.2వేలు, 527 మార్కులు పొందిన తనుశ్రీకి రూ.వెయ్యిని సంస్థ కన్వీనర్ రామచంద్రారెడ్డి సొంతంగా అందించారు.

319 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం

పెద్దతిప్పసముద్రం : ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలో పండ్ల తోటల పెంపకం పనులు చేపట్టినట్లు ఎంపీడీఓ బ్రహ్మానందరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ ఉపాధి పథకం ద్వారా మండలంలోని 175 మంది రైతులకు చెందిన 319 ఎకరాల్లో మామిడి, అల్లనేరేడు, చీనీ, సపోటా, దానిమ్మ, నిమ్మ లాంటి పండ్ల తోటలు సాగు చేసేందుకు రైతులు సమాయత్తం అవుతున్నారని తెలిపారు.

పీర్ల పండుగకు ముస్తాబు

పెనగలూరు : మండలంలోని పెనగలూరు కొత్తపల్లి గ్రామంలోని పీర్ల చావిడీ మొహర్రం పండుగ సందర్భంగా ముస్తాబైంది. పీర్లను దించి నిలపెట్టడంతో గ్రామంలో పండుగ వాతావరణం మొదలైంది. ప్రతి ఏడాది హిందూ, ముస్లింలు ఘనంగా నిర్వహించుకునే పండుగ ఈ పీర్ల పండుగ. ఈ పండుగను ప్రజలందరూ కలిసి జరుపుకోవడం ఆనవాయితీ. మూడు రోజులపాటు జరుగుతుంది. ప్రతిరోజూ పీర్లను ఊరేగిస్తూ చివరి రోజు అగ్నిగుండ ప్రవేశం జరుగుతుందని పీర్ల చావిడి నిర్వహకులు తెలియజేశారు. ఇప్పటికే బంధుమిత్రులు, సుదూర ప్రాంతాలలో ఉన్న వారు ఈ పీర్ల పండుగను చూసేందుకు గ్రామానికి చేరుకున్నారు.



పీర్లను ముస్తాబు చేసిన దృశ్యం

కూలడానికి సిద్ధంగా..

పుల్లంపేట : కడప–చెన్నై జాతీయ రహదారిలోని అనంతంపల్లి సమీపంలో ఓ వృక్షం కూలడానికి సిద్ధంగా ఉంది. వాహనదారులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ ప్రయాణిస్తున్నారు. పక్కనే ప్రభుత్వ పాఠశాల ఉండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఎప్పుడు ఏ ప్రమాదం వాటిల్లుతుందోనని ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా వారు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.



అనంతంపల్లి వద్ద ఎండిపోయిన చెట్టు

రాష్ట్ర స్థాయి వాల్‌బాల్ పోటీల్లో ప్రతిభ

ములకలచెరువు : మండలంలోని కదిరినాయునికోట పంచాయతీ నాయనవారిపల్లికి చెందిన షాహీదా రాష్ట్ర స్థాయిలో జరిగిన వాల్‌బాల్ చాంపియన్ పోటీల్లో సత్తా చాటినట్లు వాల్‌బాల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్వర్ బాషా తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎన్‌టీఆర్ జిల్లా నందిగామాలో ఈ నెల 6, 7 తేల్లో జరిగిన సీనియర్ బాలికల వాల్‌బాల్ చాంపియన్‌షిప్‌లో సీనియర్స్ ఉమెన్ ఓపెన్ కెటగిరీ ద్వారా షాహీదా రాష్ట్ర స్థాయిలో సత్తా చాటి గోల్డ్‌మెడల్ సాధించిందన్నారు. దాతలు యువతికి ఆర్థికంగా సహాయం అందజేస్తే జాతీయ స్థాయి పోటీల్లో కూడా ప్రతిభ చాటుతుందని జిల్లా కార్యదర్శి షబ్బీర్ పేర్కొన్నారు.

2019కి ముందు భూమి ఉన్న వారికే పీఎం కిసాన్

పెనగలూరు : 2019 ఫిబ్రవరి నెలకు ముందు భూమి ఉన్న రైతులకు మాత్రమే పీఎం కిసాన్ వర్తిస్తుందని వ్యవసాయశాఖ అధికారి పవన్ కుమార్ అన్నారు. మంగళవారం వ్యవసాయశాఖ సిబ్బందితో పెనగలూరు రైతు భరోసా కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 ఫిబ్రవరికి ముందు భూమి ఉండి వారి మరణానంతరం భూమి మార్చుకున్న వారసులకు మాత్రం ఈ పథకం వర్తిస్తుందని పేర్కొన్నారు. కొత్తగా భూమిని కొనుగోలు చేసినా, భూమి రిజిస్ట్రేషన్, భాగ పరిష్కారాలు, మరణం కాకుండా దాన విక్రయాలు 2019 తరువాత చేసుకున్న వారు అనర్హులని తెలిపారు. అటువంటి వారు రైతు భరోసాకు దరఖాస్తు చేయరాదన్నారు. కేంద్ర ప్రభుత్వం అవకాశం ఇచ్చేంత వరకు దరఖాస్తు చేయరాదన్నారు. ఒకసారి రిజిస్టర్ అయితే భవిష్యత్తులో ఆధార్ కార్డుపై తిరిగి దరఖాస్తు చేసుకోవడానికి వీలుపడదన్నారు.



వ్యవసాయశాఖ సిబ్బందికి శిక్షణ ఇస్తున్న వ్యవసాయశాఖ అధికారి పవన్ కుమార్

పీఎం కిసాన్ కోసం రైతు భరోసా కేంద్రంలో మాత్రమే వాపసు కాకుండా పరిశీలించుకొని దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ విధానంపై వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

సుండుపల్లె : గర్భిణులు ప్రతినెలా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు పౌష్టికాహారం తీసుకోవాలని రాయవరం ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ శేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణులకు మడితాడు గ్రామంలో పని చేసే ఆరోగ్య సిబ్బంది భోజనాలు కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గర్భిణులు ఎప్పటికప్పుడు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సలు చేయించుకుంటే ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. పీఎం ఎస్ఎంఎస్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన గర్భిణులకు బీపీ, షుగర్, హెచ్‌బీ పరీక్షలు చేశారు. అవసరమైన వారిని స్కానింగ్‌కు రెఫర్ చేశారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పు చేయించుకోవాలని, ప్రతి కాన్పుకు మూడు సంవత్సరాలు ఎడమ (తేడా) ఉండాలని, అందుకోసం ప్రతి ఒక గర్భిణి తాత్కాలిక పీపీఐయూసీడీ వేసుకోవాలని తెలియజేశారు. అంత్ర ఇంజక్షన్ వాడాలని తెలియజేశారు. కాన్పు ఎడమ కావడం వల్ల తల్లీ, బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. మడితాడు ఆరోగ్య కేంద్రంలో పని చేసే ఏఎన్ఎం శశికళ, సీహెచ్‌ఓ లక్ష్మీ ప్రసన్న, ఆశా కార్యకర్తలు సుగుణ, ప్రమీల, రెడ్డమ్మ, పద్మజలు 35 మంది గర్భవతులకు భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ వీరనారాయణ, సూపర్ వైజర్ ఎల్లమ్మ, సీహెచ్‌ఓలు, ఏఎన్ఎంలు, ల్యాబ్ టెక్నికల్ వర్కర్ ప్రసాద్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



గర్భిణులకు భోజనం వడ్డిస్తున్న వైద్యులు, సిబ్బంది

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి

పుల్లంపేట : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని పుల్లంపేట కెనరా బ్యాంక్ మేనేజర్ నవీన్ కుమార్ రాజు సూచించారు. మంగళవారం స్థానిక ఎస్‌బీవీడీ సభా జూనియర్ కళాశాలలో ఆ బ్యాంక్ వారు మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం కావడంతో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటితే అవి వృక్షాలుగా మారుతాయని తద్వారా పర్యావరణాన్ని కాపాడవచ్చన్నారు. నేటి మొక్కలే రేపటి వృక్షాలని, చెట్ల ద్వారా ఆరోగ్యాన్ని పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది దిలీప్ కుమార్‌రెడ్డి, లక్ష్మీదేవి, మనీషా, పెంచలమ్మ తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న కెనరా బ్యాంక్ మేనేజర్, సిబ్బంది

'విశ్వ కర్మ యోజన' సద్వినియోగం చేసుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : విశ్వ కర్మ యోజన (పథకం) ప్రతి కార్మికుడు సద్వినియోగం చేసుకోవాలని విశ్వ కర్మ యోజన పథకం మేనేజర్ అంజూ తెలిపారు. మంగళవారం కడప నగరంలో శిక్షణ పొందిన చేతి వృత్తిదారులను కలిసి శిక్షణలో నేర్చుకున్న అంశాలను మేనేజర్ అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విశ్వ కర్మ పథకానికి 18 రకాల చేతి వృత్తిదారులు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఈ పథకానికి దరఖాస్తులు చేసుకొన్న వారికి ఆయా వృత్తులకు సంబంధించి 6 రోజుల పాటు ఉచితంగా శిక్షణ ఇస్తామని చెప్పారు. శిక్షణ పొందిన వారికి స్టయిఫండ్ కింద రూ. 4 వేలు ఇస్తామన్నారు. వేంపల్లెలో 150 మంది కార్మికులు శిక్షణ పూర్తి చేసినట్లు చెప్పారు. శిక్షణ పూర్తి చేసుకొన్న నెల రోజులకు రూ.15 వేలు విలువ చేసే పనిముట్లు ప్రభుత్వం ఉచితంగా ఇస్తుందని చెప్పారు. అలాగే ఉపాధి కోసం లక్ష రూపాయల రుణాన్ని ఇస్తుందన్నారు. ఈ రుణానికి 5 శాతం వడ్డీ కట్టాల్సి వస్తుందని చెప్పారు. ఈ శిక్షణ శిబిరంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బల్లారపు రామాంజనేయులు, ట్రైనర్స్ హరినాథ్ రెడ్డి, శిరీషా, కార్మికులు పాల్గొన్నారు.



కార్మికులతో అధికారులు

మినుము పంటలో మెళకువలు పాటించాలి

కలసపాడు : మినుము పంటలో మెళకువలు పాటించాలని మండల వ్యవసాయాధికారి జాకీర్‌షరీఫ్ తెలిపారు. మంగళవారం మండలంలో రైతులు సాగు చేసిన మినుము పంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు పడినందున మినుము పంటలో పురుగులు తెగుళ్ళు సోకే అవకాశం ఉందన్నారు. లేత దశలో ఆకులు ఉన్నప్పుడు చిత్తపురుగులు ఆకులపై రంధ్రాలు చేస్తాయని, పేనుబంక మినుములో కాండంపై, పూతపై ఒక పొరలా ఏర్పడి రసం పీలిస్తుంటాయని తెలిపారు. వీటి నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6 ఎంఎల్ లేదా అసిఫేట్ 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. అలాగే పంటకు పల్లాకు తెగులు సోకినప్పుడు మొక్కల ఆకులు పసుపురంగులోకి మారతాయని, ఈ వైరస్ తెల్లదోమ ద్వారా మాత్రమే వ్యాప్తి చెందుతుందన్నారు. దీని నివారణకు ఎసిటమాప్రిడ్ 0.5 గ్రాములు లేదా ప్లోనికామిడ్ 0.3 గ్రాములు లేదా డైఫెన్థియురాన్ 0.5 మిల్లీలీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని తెలిపారు.

'వారాహి'గా శ్రీ బాల పోలేరమ్మకు నవరాత్రులు

కడప కల్చరల్ : కడప నగరం చిన్నచౌకువీధిలోని శ్రీ బాల పోలేరమ్మ మాతకు ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని శ్రీ వారాహి దేవిగా అలంకరించారు. వారం రోజులపాటు దేవీ నవరాత్రి పూజలు వారాహి అలంకారంలోనే నిర్వహించనున్నారు. జిల్లాలో తొలిసారిగా ఈ అలంకారంలో అమ్మవారికి పూజలు నిర్వహించడం విశేషం. ఇందులో భాగంగా మంగళవారం ఆలయంలో అమ్మవారికి విశేష అలంకారం నిర్వహించి లలిత సహస్ర నామ పారాయణాన్ని సామూహికంగా నిర్వహించారు. అనంతరం మహిళా భక్తులు ఆలయ ప్రాంగణంలో కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం అర్చకులు పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



విశేష అలంకారంలో బాల పోలేరమ్మ తల్లి

హైదరాబాద్‌కు కొత్త బస్సు సర్వీసు

మదనపల్లె సిటీ : ప్రయాణికుల సౌకర్యం కోసం హైదరాబాద్‌కు కొత్త బస్సు సర్వీసు ప్రారంభించినట్లు ఆర్టీసీ -1 డీఎం మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. మంగళవారం హైదరబాద్ సర్వీసుకు వెళ్లే సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మదనపల్లె డిపో నుంచి ప్రతి రోజు రాత్రి 8 గంటలకు కొత్త సూపర్ లగ్జరీ బస్సును నడుపుతున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి మదనపల్లెకు ప్రతి రోజు రాత్రి 8.30 గంటలకు బస్సు బయలు దేరుతుందన్నారు. ప్రయాణికులకు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐ రేవతి, సిబ్బంది పాల్గొన్నారు.

కడపలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలి

కడప ఎడ్యుకేషన్ : నూతనంగా ఏర్పాటైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కడప ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని విద్యార్థి యువజన సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు మంగళవారం కడపకు వచ్చేసిన రవాణశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని ఆర్ అండ్ బి అతిథి గృహంలో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న, పీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, ఎస్‌బిఐబి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్‌లు మాట్లాడుతూ కడప ఉక్కును నిర్మించడం వల్ల వేలాది మంది నిరుద్యోగులకు ఉపాధి దొరుకుతుందన్నారు. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ఉద్యాన పంటల సాగుకు కృషి

తంబళ్లపల్లె : మండలంలోని ఉపాధి హామీ పథకం ద్వారా ఉద్యాన పంటలు అధికంగా సాగు చేసేందుకు మండల టెక్నికల్ ఫీల్డ్ అసిస్టెంట్లు కృషి చేయాలని ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. మంగళవారం ఉపాధి హామీ పథకం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు వారి పరిధిలో 5 ఎకరాల లోపు సన్నకారు రైతులకు పండ్ల తోటలు, పాడి రైతులు పశుగ్రాసం పెంచుకునేందుకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఏపీఓ అంజనప్ప మాట్లాడుతూ ఎకరాలో 70 మామిడి మొక్కలు నాటితే వాటి సంరక్షణ కోసం మూడేళ్లలో రూ. 99,911, ఎకరాలో 60 టెంకాయ మొక్కలు నాటుకుంటే రూ.88,300 ఎకరాలో 40 అల్లనేరేడు మొక్కలు నాటుకుంటే రూ.61 వేలు, అదే విధంగా పాడి రైతులు ఎకరాలో పశుగ్రాసం నాటుకుంటే రెండు సంవత్సరాల్లో రూ.40 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. వీటితో పాటు పూల మొక్కల సాగు, రైతుల పొలాల్లో గట్లు నిర్మాణం, ఫాం పాండ్ల నిర్మాణం చేపట్టవచ్చునన్నారు. రైతులు సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఉపాధి ఇంజినీర్ రామన్న, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

శిల్పారామం కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : శిల్పారామంలో పనిచేసే కార్మికుల సమస్యలను పరిష్కరించాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్‌సీపీ బృందం శిల్పారామంలో పర్యటించి కార్మికుల సమస్యలను తెలుసుకున్నారు. రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ కార్మికులు, సిబ్బంది కనీస వేతనాలకు నోచుకోవడం లేదన్నారు. శిల్పారామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు తగినంత మంది సిబ్బంది లేరన్నారు. కార్మికులందరికీ సమాన హక్కులు కల్పించి సమాన వేతనాన్ని అందించాలని ఆంధ్ర ప్రదేశ్ శిల్పారామం బాధ్యులు మునిరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందిస్తూ త్వరలోనే సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి వర్గ సభ్యులు మడగలం ప్రసాద్, రాయలసీమ మహిళా సంఘం జిల్లా కార్యదర్శి తస్లీమ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌జేడీకి అభినందన

కడప ఎడ్యుకేషన్ : పాఠశాల విద్య ఆర్‌జేడీగా బాధ్యతలు చేపట్టిన కాగిత శామ్యూల్‌ను పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మోపూరి వెంకటశివారెడ్డి, రాష్ట్ర సీపీఎస్ కన్వీనర్ గుజ్జల తిరుపాల్, రాష్ట్ర కౌన్సిలర్ లక్ష్మీకాంత్‌లు మంగళవారం ఆర్‌జేడీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు ఆర్‌జేడీ దృష్టికి పలు ఉపాధ్యాయ సమస్యలను తీసుకెళ్లారు.

ఇంటి సామగ్రి నిల్వపై నివేదిక

బి.కొత్తకోట : గృహనిర్మాణశాఖ గోదాముల్లో నిల్వ ఉన్న ఇంటి నిర్మాణ సామగ్రిపై జిల్లా అధికారులకు నివేదిక పంపినట్లు హౌసింగ్ ఇన్‌చార్జ్ డీఈఈ వెంకటరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ తంబళ్లపల్లె నియోజకవర్గంలోని గోదాముల్లో సిమెంటు, కమ్మి, తలుపులు, కిటికీలు, ఇతరా సామగ్రి లబ్ధిదారులకు పంపిణీ చేయగా నిల్వ ఉన్న వివరాలను పంపినట్లు చెప్పారు. వంద రోజుల్లో 3,191 ఇంటి నిర్మాణాల స్థాయి పెంపునకు లక్ష్యాలను నిర్దేశించగా వాటి పూర్తికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. లబ్ధిదారులు నిర్మించకునే ఇళ్లకు సత్వరమే బిల్లులు మంజూరవుతాయని తెలిపారు. నిర్మాణాల పూర్తికి దృష్టి పెట్టామని తెలిపారు.

పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యత

రాయచోటి అర్బన్ : పట్టణంలో పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ వాసుబాబు అన్నారు. మంగళవారం ఆయన మాజీ ఎమ్మెల్యే నారాయణరెడ్డి తనయుడు రాహుల్‌రెడ్డి, మున్సిపల్ అధికారులతో కలసి పలు వార్డులలో పరిశీలించి పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సమస్య తదితరాలను పరిశీలించారు. పట్టణంలోని పలు వార్డులలో నెలకొన్న సమస్యలపై వారు స్థానికులను అడిగి తెలుసుకున్నారు. 16వ వార్డులో తాగునీటి సమస్య గురించి తెలుసుకుని, వెంటనే సమస్యను పరిష్కరించాలంటూ అధికారులను ఆదేశించారు. 9వ వార్డులోని అలీమాబాద్ వీధిలో పైపులైన్ లీకేజీ, కాలువల్లో పూడికతీత, శానిటేషన్ సమస్యలను పరిశీలించారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలంటూ మున్సిపల్ పారిశుధ్య, తాగునీటి విభాగం అధికారులను ఆదేశించారు. పురప్రజలు తమ ఇళ్లలోని చెత్తను మురుగు నీటి కాలువలు, ఖాళీ స్థలాలలో వేయకుండా చెత్తబండ్ల సేకరణ సిబ్బందికి అందజేయాలని కోరారు.



ఇళ్ల మధ్య పేరుకుపోయిన చెత్తను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్, అధికారులు

10న ధర్నాను జయప్రదం చేయండి

రాయచోటి అర్బన్ : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక చట్టాల అమలుకు నిరసనగా అన్ని మండల తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ఈ నెల 10వ తేదీన నిర్వహింప తలపెట్టిన ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ చంద్రశేఖర్, రామాంజులు తెలిపారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు కార్మిక కోడ్‌లను అమలు చేయడం ద్వారా కార్మిక హక్కులను కాలరాయాలని చూస్తోందన్నారు. ఎల్‌ఐసీ, బీఎస్ఎన్ఎల్, పోస్టల్, బ్యాంకింగ్, డిఫెన్స్, రైల్వే, పోర్టులు, ఎయిర్‌పోర్టులు, రోడ్లు తదితర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించే యత్నాలు చేస్తుండటం దారుణమన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ వ్యక్తులకు విక్రయించడమే ధ్యేయంగా పని చేస్తోందన్నారు. కేంద్రం అనుసరిస్తున్న కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా తలపెట్టిన ధర్నా కార్యక్రమంలో అన్ని వర్గాల కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు

సిద్దవటం : పెన్నా నదీ పరివాహక ప్రాంతాల నుంచి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని కడప ఇన్‌చార్జి ఆర్డీఓ వెంకటపతి హెచ్చరించారు. సిద్దవటం మండల పరిధి జ్యోతి గ్రామం ఇసుక రీచ్‌లోని డంప్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ ఇక్కడ వీఆర్‌వోలు, వీఆర్ఏలు విధులు నిర్వహించాలని, ఇసుక అక్రమాలు జరగకూడదని తహసీల్దారు మురాషావలికి ఆదేశించారు. అలాగే రికార్డులను పరిశీలించి, పక్కాగా నిర్వహించాలని చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతన ఇసుక విధానం ప్రవేశ పెట్టిందన్నారు. ఇసుక అక్రమ రవాణాపై తమకు అందుతున్న సమాచారం ప్రకారం నిఘా వేసి ఉంచామని అన్నారు. సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉండాలన్నారు. ప్రతి ఇసుక వాహనానికి రవాణా బిల్లులు ఇవ్వాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు మురాషావలి, ఇన్‌చార్జి ఈఓపీఆర్‌డీ లక్ష్మినరసయ్య, ఆర్ఐ అనూరాధ, ఏపీఎం వెంకటేశ్వర్లు, వీఆర్‌వో శ్యాంబాబు, ఏఎస్ఐ బాబయ్య, పంచాయతీ కార్యదర్శి విజయ్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సిద్దవటంలో టన్ను ఇసుక రూ.340

సిద్దవటం మండలంలోని జ్యోతి ఇసుక రీచ్‌లో ఉన్న డంపు వద్ద టన్ను ఇసుకను రూ.340కు విక్రయిస్తున్నారు. ఒక ట్రాక్టర్ ఇసుక (5 టన్నులు) రూ. 1700, అదే ఆరు టైర్ల టిప్పర్‌కు అయితే (14 టన్నులు) రూ.4,760 పడుతుంది. 10 టైర్ల టిప్పర్‌కు అయితే (21 టన్నుల ఇసుక) 7,140 తీసుకుంటున్నారు. డ్రైవర్‌లు ఆధార్ కార్డు తీసుకొని వెళ్లాల్సి ఉంటుంది. అక్కడ ఉన్న అధికారులకు స్కానర్ ద్వారా ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లోనే నంబర్ స్లిప్ వస్తుంది. అందులో డ్రైవర్ ఆధార్ నంబర్ నమోదు అవుతుంది. ఇసుక ఎక్కడికి వెళ్తుందో ఆ ప్రాంతం పేరు, వేబిల్లు ఇస్తున్నారు. ఇక్కడ అధికారులు మూడు షిఫ్టులుగా పని చేస్తున్నారు. మొదటి షిఫ్టు ఉదయం 6 నుంచి 1 గంట వరకు, రెండవ షిఫ్టు మధ్యాహ్నం 1 గంట నుంచి రాత్రి 10 వరకు, ఆ తరువాత అమ్మకాలు జరిగితే మూడవ షిఫ్టు రాత్రి 10 నుంచి ఉదయం 6 వరకు రీచ్‌లో అధికారులు పని చేస్తారు. ప్రతి షిఫ్టునకు ఒక అధికారి, ఒక హెడ్ కానిస్టేబుల్ తదితరులు ఉంటున్నారు.



జ్యోతి ఇసుక రీచ్ వద్ద తహసీల్దార్‌కు సూచనలు ఇస్తున్న కడప ఇన్‌చార్జి ఆర్డీఓ వెంకటపతి

ఉచిత ఇసుక విధానం తీసుకొచ్చిన ఘనత చంద్రబాబుదే

రాయచోటి : ప్రజలకు ఉచితంగా ఇసుక అందించేందుకు కొత్త పాలసీని తీసుకొచ్చిన ఘనత సీఎం చంద్రబాబు నాయుడుదేనని రాష్ట్ర రవాణ, యువజన, క్రీడా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి రాయచోటిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో సీఎం చిత్రపటానికి ఆయన పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటైన 20 రోజుల్లోనే ఉచిత ఇసుక పాలసీని అమలు చేయడం సంతోషకరమన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో పూజలు

కడప కల్చరల్ : కడప నగరం శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం భక్తులు దోష నివారణ కోసం రాహుకాల పూజలను నిర్వహించారు. తెల్లవారుజామున అమ్మవారికి పంచామృతాభిషేకం, పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో రాహుకాల పూజలు నిర్వహించారు. భక్తులు దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేసి తమ కోరికలు నెరవేరాలని మొక్కుకున్నారు. కాగా ఈనెల 21న ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని ఆలయంలో అమ్మవారికి పవిత్ర నదీ జలాలు నింపిన 108 కలశాల నీటితో అష్టోత్తర శతకలశాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు, నిర్వాహకులు దుర్గాప్రసాద్‌లు తెలిపారు.





రాహుకాల పూజలు నిర్వహిస్తున్న భక్తులు